ప్రజాశక్తి

మంగళవారం 20 ఆగస్టు 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అంతులేని విషాదం

- కలుషితాహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి
- 80 పైచిలుకు మందికి అస్వస్థత
- ఉమ్మడి విశాఖలోని పలు ఆసుపత్రుల్లో చికిత్స
- కన్నీరుమున్నీరవుతున్న గిరిజన గ్రామాలు
- కోటవురట్లలోని పరిశుద్ధాత్మ అగ్నిస్తుతి ఆరాధన ట్రస్ట్ అనాథాశ్రమంలో ఘటన
- ఆశ్రమం సీజ్, నిర్వాహకుడు అరెస్టు

ప్రజాశక్తి - కోటవురట్ల, నర్సీపట్నం, విశాఖ కలెక్టరేట్, చింతపల్లి, పాడేరు విలేకరులు

అనకాపల్లి జిల్లాలో అంతులేని విషాదం చోటుచేసుకుంది. కలుషితాహారానికి విద్యార్థులు బలయ్యారు. చనిపోయిన, అస్వస్థతకు గురైన వారిలో అనాథ పిల్లలే ఎక్కువ మంది ఉండటంతో అందరినీ ఈ ఘటన కలిచివేసింది. కోటవురట్ల మండలంలోని కైలాసపట్నం వద్దగల పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన ట్రస్ట్ అనాథాశ్రమం ఈ ఘటనకు మూలంగా నిలిచింది. కలుషిత ఆహారం తినడంతో అక్కడ విద్యనభ్యసిస్తున్న ముగ్గురు విద్యార్థులు మృతిచెందారు. 80 పైచిలుకు మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం సోమవారం వెలుగులోకి వచ్చినప్పటి నుంచీ ఉమ్మడి విశాఖలోని ప్రతి హృదయం బరువెక్కింది.

పలువురి కథనం

మేరకు.. కైలాసపట్నంలోని అనాథాశ్రమంలో 90 మంది పైచిలుకు గిరిజన విద్యార్థులు ఉంటున్నారు. వీరంతా అక్కడే ఉండి ఒకటి నుంచి ఇంటర్ వరకూ చదువుతున్నారు. వారంతా శనివారం కలుషిత ఆహారం తిన్నారు. వారికి ఆ రోజు మధ్యాహ్నం నక్కపల్లి మండలానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సమోసా, చాక్లెట్లు అందించారు. అలాగే కోటవురట్ల మండలం పొందూరు గ్రామంలో దాసరి లోవరాజు పెదఖర్మ సందర్భంగా వండిన పలావు, వైట్‌రైస్, సాం బారు, పన్నీర్ కర్రీ, పునుకుల కర్రీని రాత్రికి విద్యార్థులకు పెట్టారు. ఆ మిగతా 2లో..



పిల్లల ఆరోగ్య పరిస్థితిని కెజిహెచ్ వైద్యులను అడిగి తెలుసుకుంటున్న హోం మంత్రి అనిత, విశాఖ ఎంపీ శ్రీభరత్, తదితరులు



కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులు

సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం

వార్త 2లో..

డ్రగ్స్‌తో యువత జీవితాలు నాశనం

వార్త 8లో..

రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి

వార్త 5లో..

పిజిఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

వార్త 2లో..



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు

హత్యాచారంపై నిరసనలు

విశాఖలో ఏడో రోజూ అదే ఉధృతి

వార్తలు 8లో..

గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర

- మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గిరిజనుల అనుబంధ ప్రాథమిక సంఘాల నెట్‌వర్క్ ద్వారా గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధరలను సక్రమంగా అందించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. విశాఖపట్నంలోని గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశాన్ని ఆమె నిర్వహించారు. మొట్ట మొదటిసారి కార్యాలయానికి విచ్చేసిన మంత్రికి జిసిసి ఎమ్‌డి కల్పనకుమారి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అడవులపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన కుటుంబాల నుంచి మైనర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ ఏ విధంగా సేకరిస్తున్నారని అధికారులను అడిగారు. మిగులు వ్యవసాయ ఉత్పత్తులను గిరిజన రైతుల నుంచి సేకరించడం, విక్రయించిన ఉత్పత్తులకు విలువ జోడించడం, ఆ ఉత్పత్తులకు మెరుగైన అమ్మకపు రాబడిని తేవడం చేయాలన్నారు. జిసిసి అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి, లాభాల బాటలో నడపాలని ఆదేశించారు.

పిల్లల విక్రయ అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

17 మంది అరెస్టు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సిపి బాగ్చి

ప్రజాశక్తి - ఎంవిపీ.కాలనీ : పసికందులను విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన 17 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఆరుగురు పసిపిల్లలను రక్షించారు. ఆ కేసు వివరాలను విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చి సోమవారం సాయంత్రం నగర పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. విశాఖపట్నం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హార్బర్ పార్కు వద్ద ఐదు నెలల చిన్నారిని విక్రయిస్తుండగా ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని, విచారణ అనంతరం మరొక 15 మందిని విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, గాజువాక, విజయవాడ, నక్కపల్లి ప్రాంతాలలో అరెస్టు చేశామని తెలిపారు. వీరు ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, తెలంగాణ, ఢిల్లీలలోనూ పసిపిల్లలను విక్రయిస్తున్నట్టు వెల్లడించారు. టాస్క్ ఫోర్స్ సిఐ కె.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో చాకచక్యంగా తాము పట్టుకున్నట్టు తెలిపారు. తమకు ఉన్న సమాచారం ప్రకారం మొత్తం 15 మంది పిల్లలను వీరు విక్రయించారని, మిగిలిన వారిని కనుగొనే ప్రయత్నం చేస్తున్నామని, విచారణ కొనసాగుతుందని తెలిపారు. ఈ ముఠాలోని సభ్యులకు ఆసుపత్రులలో వివిధ విభాగాలలో పనిచేసిన అనుభవం ఉందని, ఆ అనుభవంతో పిల్లలు కావాలనుకునే తల్లిదండ్రులకు పిల్లలను అమ్మటం ప్రారంభించారని ఆయన తెలిపారు. ఆ పిల్లలను ఐదు నుంచి ఏడు లక్షలకు విక్రయిస్తున్నారని చెప్పారు. విశాఖ నగరంలో మూడో పట్టణ పోలీస్ స్టేషన్, గాజువాక పోలీస్ స్టేషన్ల పరిధిలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పిల్లల విక్రయ అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

వీరిపై ఒక్కొక్క కేసు నమోదయ్యాయన్నారు. ముఖ్యంగా ఆసుపత్రుల నుంచి పిల్లలను దొంగిలించడం, గర్భం దాల్చిన మైనర్ బాలికలను ట్రాప్ చేయడం, అక్రమ సంబంధాల వల్ల కలిగే పిల్లలను గుర్తించడం, వరుసగా ఆడపిల్లలు పుడుతున్న కుటుంబాలను గుర్తించడం, అనారోగ్య సమస్యలతో పుట్టిన పిల్లలను గుర్తించడం, పేదరికంలో ఉన్న వారిని డబ్బుకు లొంగేలా ప్రేరేపించడం ద్వారా ఈ ముఠా శిశు విక్రయాలకు పాల్పడుతోందని తెలిపారు. అంతేకాకుండా సరోగసి నిబంధనలు కఠినతరం కావడంతో పిల్లలు లేని తల్లిదండ్రులు ఈ పిల్లలను కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారని ఆయన తెలిపారు. విశాఖ నగరంలో శిశు విక్రయాలు అరికట్టేందుకు జిల్లా కలెక్టర్ సహకారంతో ముందుకు వెళ్లేందుకు సన్నాహకాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆసుపత్రులకు సీసీ టీవీ కెమెరాలను విధిగా అమర్చాలని, అవి వర్కింగ్ కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలని, లేబర్ వార్డుల వద్ద ప్రైవేట్ భద్రత ఏర్పాటు చేసుకోవాలని, తల్లీబిడ్డలకు ఆర్‌ఎఫ్‌ఐడి ట్యాగులు అందించాలని ఆయన సూచించారు. ఈ ముఠా గురించి మరింత లోతుగా దర్యాప్తు జరిపేందుకు తమ బృందాన్ని ఢిల్లీ పంపుతున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో జాయింట్ కమిషనర్ కె.ఫకీరప్ప పాల్గొన్నారు.

వైజాగ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న మారథాన్ నిర్వహించనున్నారు. ఈ మేరకు సంధ్య మెరైన్ వైజాగ్ మారథాన్ 3వ ఎడిషన్ పేరిట జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌లను విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ సోమవారం అధికారికంగా ప్రారంభించారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్థానిక నోవాటెల్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశాఖ నగరంలో రన్నింగ్ చేసే వారి సంఖ్య పెరగాలని ఆకాంక్షించారు. మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు సహకారాన్ని అందిస్తానని అన్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడకముందే శరీరానికి తగిన వ్యాయామాన్ని అందించి సురక్షితంగా ఉండాలని సూచించారు. విశాఖలో అందుబాటులో ఉంటే 5కె విభాగంలో తాను పాల్గొంటానని తెలిపారు. అనంతరం వైజాగ్ రన్నర్స్ సొసైటీ ప్రెసిడెంట్ బాలకృష్ణ రాయ్ మాట్లాడుతూ ఈ పోటీల్లో అన్ని వయస్సుల వారూ పాల్గొనే విధంగా 21కె, 10కె, 5కె, 3కె విభాగాల్లో మారథాన్ నిర్వహిస్తున్నామని, ఆసక్తి గలవారు http://www.vizagmarathon.runలో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. విశాఖ పోలీస్ శాఖ వారి సౌజన్యంతో మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన కల్పిస్తామని, జివిఎంసి వారి సహకారంతో నగరంలో ప్లాస్టిక్ నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ రన్‌లో పాల్గొనేవారికి ప్యూమ రేస్ టీ షర్ట్, మెడల్, రేస్ ఫోటోగ్రాఫ్స్, ఎనర్జీ డ్రింక్, అల్పాహారంతో పాటు విజేతలకు రూ.5 లక్షల విలువ గల బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంధ్య మెరైన్ డైరెక్టర్ అరుణ్, మెడికల్ పార్టనర్ అపోలో హాస్పిటల్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రామచంద్ర, వరుణ్ గ్రూప్ అధినేత వరుణ్, శ్రీ కన్య కార్పొరేషన్ అధినేత డి.శ్రీనివాస్, వైజాగ్ రన్నర్ సొసైటీ సెక్రటరీ కె.శ్రీనివాస్, వైజాగ్ రన్నర్ సొసైటీ కోశాధికారి డాక్టర్ రాధిక, రానా, హర్మిందర్, వివేక్, డాక్టర్ గాయత్రి, డాక్టర్ మాధురి పాల్గొన్నారు.

తోపుడు బండ్లు కార్మికులకు ఉపాధి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ హైవేపై ఉన్న 32 మంది తోపుడుబండ్లు కార్మికులకు ఉపాధి రక్షణ కల్పించాలని కోరుతూ విశాఖ జిల్లా తోపుడు బండ్ల సంఘం ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎ.సింహాచలం మాట్లాడుతూ 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టం ప్రకారం హాకర్ జోన్‌గా ఈ ప్రాంతాన్ని ప్రకటించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో తోపుడు బండ్లు వ్యాపారం కొనసాగించుకోవడానికి పూర్తి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హాకర్ జోన్‌లో 32 తోపుడు బండ్లు కార్మికులకు షెడ్లు వేసి, కరెంటు, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఆర్ అండ్ బి స్థలంలో ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా 30 సంవత్సరాల నుంచి తాము ఇక్కడ బతుకుతున్నామని, తమ తోపుడు బండ్లు తొలగిస్తే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ యాజమాన్యం ఆర్ అండ్ బి స్థలాన్ని ఆక్రమించి షాపులకు టెండర్లు పిలిచి షాపులు కట్టి హైవే ఫేసింగ్‌లో షాపులు ప్రారంభించాలని చూస్తోందని, ఆ విధంగా చేస్తే మా తోపుడు బండ్లకు రక్షణ ఉండదని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అనపర్తి అప్పారావు, కె.కుమారి, మద్దిలపాలెం తోపుడు బండ్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోలా శ్రీను, కుమార్, సాయి, గణేష్ పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : విశాఖ కలెక్టరేట్, జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు సోమవారం అర్జీదారుల నుంచి వినతులు వెల్లువలా వచ్చి పడ్డాయి. అర్జీదారులు సంతృప్తిచెందేలా వినతులు పరిష్కరించబడాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల శాసనమండలి నియోజకవర్గం ఉప ఎన్నిక ఫలితాలు ప్రకటించిన నేపథ్యంలో కోడ్ ముగిసన దరిమిలా సోమవారం నుంచి మళ్లీ యతాతథంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెసి కె.మయూర్ అశోక్, డిఆర్ఒ కె.మోహన్ కుమార్, ఆర్‌డిఒ డి.హుస్సేన్ సాహెబ్, జివిఎంసి, పోలీస్ అధికారులు పాల్గొని అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 142 వినతులు అందాయి. జివిఎంసిలో 77 వినతులు వచ్చాయి. జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఆదనపు కమిషనరు డాక్టర్ వై.శ్రీనివాసరావు, సెక్రటరీ పి.నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డా.నరేష్ కుమార్ పాల్గొన్నారు.

అంతులేని విషాదం

(మొదటి పేజీ తరువాయి..) ఆహార పదార్థాలు అక్కడి పెదఖర్మలో వండగా మధ్యాహ్న భోజనం తరువాత మిగిలిపోతే ఇక్కడికి పంపించారు. అవి తిన్న తరువాత విద్యార్థులు అస్వస్థతకు గురవడం మొదలైంది. చింతపల్లి మండలం నిమ్మలపాలెంనకు చెందిన టి.జాషువా (7) శనివారం సాయంత్రం మృతిచెందాడు. ఆదివారం రాత్రి చింతపల్లి మండలం బలబద్రం గ్రామానికి చెందిన కొర్ర శ్రద్ధ (7), కొయ్యూరు మండలం రెల్లల పాలెంనకు చెందిన గెమ్మెలి నిత్య (భవాని) (8) మృతిచెందారు. దీంతో సోమవారం ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం విశాఖ కెజిహెచ్‌లో 14 మంది, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో 18 మంది, అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వాసుపత్రిలో 8 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉంది.

కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వారు

కెజిహెచ్ చిన్నపిల్లల వార్డులో 14 మందికి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఎస్.రవి, కె.సాయి సంతోష్, టి.అలియా, ఎం.నవీన్, కె.నాగేశ్వరి, కె.మీరా, టి.గీత, పి.జెషికా, జి.జోషిలే, పి.అరవింద్, పి.మౌనిక, పి.జ్యోతి, పి.స్వప్న, పి.మౌనిక ఉన్నారు. వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశాలు జారీ చేశారు.

బాధితులను పరామర్శించిన హోం మంత్రి అనిత

తీవ్ర అస్వస్థతకు గురై కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న 14 మంది చిన్నారులను సోమవారం సాయంత్రం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇది ఘోరమైన సంఘటన అని పేర్కొన్నారు. బయట ఫంక్షన్ నుంచి వచ్చిన ఫుడ్ తిని చిన్నపిల్లలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించామన్నారు. ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరుపుతామని తెలిపారు. ఇటువంటి అనాథాశ్రమాలు, హాస్టళ్లు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ ఉన్నా తక్షణం మూసివేయాలని ఆదేశించారు. ఆమె వెంట విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అయ్యన్న దిగ్భ్రాంతి

అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల పరిస్థితిని ఏరియా హాస్పిటల్ పర్యవేక్షకురాలు డాక్టర్ నీలవేణిదేవిని అడిగి తెలుసుకున్నారు. పరిస్థితి విషమంగా ఉంటే వెంటనే విశాఖకు తరలించాలని ఆదేశించారు. ఆ మేరకు నర్సీపట్నం ఆర్డీవో జయరాం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో పరిస్థితిని సమీక్షించారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన

మృతులకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని నర్సీపట్నంలో ఎస్‌ఎఫ్‌ఐ, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు జీ.గీతాకృష్ణ మాట్లాడారు. సిఐటియు జిల్లా నాయకులు కె.గోవిందరావు, డివైఎఫ్‌ఐ జిల్లా నాయకులు గౌతమ్, ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ నాయకులు శివ, అర్జున్, దుర్గా, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్య కోసం పంపితే విగత జీవులుగా పంపారు

విద్య కోసం తమ పిల్లలను పంపితే విగత జీవులుగా వారిని తమకు అప్పగించారని మృతుల కుటుంబ సభ్యులు బోరుమంటున్నారు.

సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం

ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, రాష్ట్ర నాయకులు పి.అప్పలనర్స, చింతపల్లి మండల కార్యదర్శి సాగిన చిరంజీవి వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ఆశ్రమాన్ని నడుపుతున్న వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే చిన్నారుల ప్రాణాలు పోయాయని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు నడుపుతున్న ఆశ్రమాలు, హాస్టల్స్ నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్య సదుపాయం అందించాలన్నారు.



ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, సిఐటియు నాయకులు



ఆశ్రమంలో విచారణ చేపడుతున్న అధికారులు

కలుషిత ఆహారం తమ పిల్లల ప్రాణాలు తీసిందని వారు చెబుతున్నారు.

అందరితో మాట్లాడాం : అల్లూరి జిల్లా కలెక్టర్

అస్వస్థతకు గురైన అందరితో తాము ఫోన్‌లో మాట్లాడామని అల్లూరి జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ తెలిపారు. వారి అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎవ్వరూ ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. పాడేరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎనిమిది మంది భాదిత విద్యార్థులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట జిల్లా ఎస్‌పి అమిత్ బర్దార్, ఎఎస్‌పి ధీరజ్, ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ విశ్వామిత్ర ఉన్నారు.

ట్రస్ట్ నిర్వాహకుడు అరెస్ట్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : పిల్లల మృతికి కారణమైన పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన ట్రస్ట్ నిర్వాహకుడు కిరణ్ కుమార్‌ను అరెస్టు చేసినట్లు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. సోమవారం సాయంత్రం మీడియాతో ఆమె మాట్లాడుతూ అనుమతి లేకుండానే అక్రమంగా గిరిజన పిల్లలను తీసుకువచ్చి ట్రస్ట్ నడుపుతున్న కిరణ్ కుమార్ ఫుడ్ పాయిజన్ జరిగిన పిల్లలకు చికిత్స చేయించకుండా, పోలీసులకు తెలుపకుండా గ్రామాలకు పంపించడంతో ముగ్గురు చని పోయారని అన్నారు. ఈ ఘటనలో భాగస్వాములను నిందితులుగా చేర్చి ఇంకా పలు సెక్షన్లతో కేసులు నమోదు చేసి పటిష్టమైన దర్యాప్తు నిర్వహించి శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా అనధికార హాస్టల్స్‌పై తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

మత్స్యకార భరోసా ఇచ్చేదెప్పుడో..?

ప్రజాశక్తి -భీమునిపట్నం : సముద్రంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇస్తామన్నా రూ.20వేలు మత్స్యకార భరోసా భృతి చెల్లింపులో జాప్యం తగదని ఎపి కాంగ్రెస్ మత్స్యకార విభాగం చైర్మన్ కదిరి జగన్నాథం ఆరోపించారు. రెండు నెలల పాటు వేట నిషేధం ముగిసి, మరో రెండు నెలలు గడుస్తున్నా మత్స్యకారులకు ఇవ్వాల్సిన భృతి విషయంలో కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా సిఎం చంద్రబాబు ప్రభుత్వం స్పందిచాలని, మత్స్యకార భరోసా కింద ఎంపికి చేసిన ఒక్కో లబ్ధిదారునికి ఇవ్వాల్సిన రూ.20వేలు భృతిని తక్షణమే చెల్లించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పిజిఆర్ఎస్‌లో మూడు అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న జెడ్‌సి కనక మహాలక్ష్మి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో జివిఎంసి జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి పాల్గొని ర్జీలు స్వీకరించారు. జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురు వచ్చి జెడ్‌సికి అర్జీలు సమర్పించారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి అందిన మూడు అర్జీలను తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత విభాగాల అధికారులకు పంపించినట్లు జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి తెలిపారు

ఎంపిడిఒల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం ఎంపిడిఒగా విజయకుమార్ సోమవారం మరోసారి బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగిన బదిలీల్లో భాగంగా పద్మనాభం ఎంపిడిఒగా పనిచేస్తున్న విజయకుమార్‌ను బదిలీచేయగా, తాజాగా చేపట్టిన బదిలీల్లో ఆయనను మళ్లీ పద్మనాభంలోనే పునర్నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మరోసారి విజయకుమార్ పద్మనాభం ఎంపిడిఒగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగబాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు కార్యాలయ సిబ్బంది స్వాగతించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపిడిఒగా లవరాజు

ఆనందపురం : ఆనందపురం ఎంపిడిఒగా అడపా లవరాజు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలకు ముందు విజయనగరం జిల్లా భోగాపురం మండలానికి బదిలీపై వెళ్లగా, అక్కడినుండి నీలం అప్పలనాయుడు ఆనందపురం వచ్చారు. తాజా బదిలీల్లో లవరాజును మళ్లీ ఆనందపురం ఎంపిడిఒగా నియమించగా, విధుల్లో చేరారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, గ్రామకార్యదర్శులు ఆయనకు అభినందనలు తెలిపారు.

వ్యాధుల నివారణే పాడి పశువులకు రక్ష

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ మాసోత్సవాలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - అరిలోవ : వ్యాధుల నివారణే పాడిపశువులకు ఆరోగ్యరక్ష అని జిల్లా కలెక్టర్ హరింధిర ప్రసాద్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో వ్యాధుల నివారణపై పాడిరైతులకు అవగాహనకు పశు సంవర్ధకశాఖ రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెల 20 నుంచి వచ్చే నెల 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వేస్తారని, వాటిని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు పశువుల్లో అత్యంత ప్రమాదకరంగా వ్యాప్తి చెందేగాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గడంతో ద్వారా పాడిరైతులకు ఆర్థికంగా నష్టం చేకూరుతుందన్నారు. గ్రామాల్లో వచ్చే పశు వైద్యసిబ్బందికి సహకరించి, శతశాతం గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని తద్వారా ఈ వ్యాధిని శాశ్వతంగా పారదోలేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ, ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్ డాక్టర్ కరుణాకర్ , సహాయ సంచాలకులు డాక్టర్. సజ్జ శ్రీనివాస్, డాక్టర్ మాదిన ప్రసాదరావు పాల్గొన్నారు.

మహిళలకు మరింత భద్రత కల్పించాలి

ప్రజాశక్తి -మధురవాడ :కోల్‌కత్తాలో యువ వైద్యురాలిపై అకృత్య ఘటనతో దేశమంతా కంపిస్తోందని, పనిచేసేచోట మహిళలకు పటిష్టభద్రత, ప్రాణరక్షణ చర్యలు చేపట్టాలని వైసిపి మహిళా విభాగం జోనల్ ఇన్‌ఛార్జి బెందాళం పద్మావతి కోరారు. బాలికలు, మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు చేసినా, అమలులో ఉదాసీన వైఖరితో ప్రయోజనం లేకుండా పోతోందని ఆవేదన వెలిబుచ్చారు. ఆసుపత్రుల్లో వైద్యులకు ముఖ్యంగా మహిళలకు భద్రత ఎంతనేది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతరత్రా మహిళలు పనిచేసే ప్రదేశాల్లో ఉమెన్ ఫ్రెండ్లీ పరిస్థితులు కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే మహిళా ఉద్యోగులకు మరింత భద్రత కల్పించాలని కోరారు. పనిప్రదేశంలోనూ, విద్యాలయాల్లోనూ సిసి కెమెరాల నిఘా పటిష్టం చేయాలని కోరారు. పోక్సో చట్టం అమలులో సుప్రీంకోర్టు మార్గనిర్దేశకాలను అనుసరించి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాలని, మహిళల రక్షణకు ఉద్దేశించిన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని పద్మావతి కోరారు.

31న మహిళా న్యాయవాదులకు వర్క్‌షాప్

ప్రజాశక్తి-సీతమ్మధార :ఈ నెల 31న విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఏరినాలో మహిళా న్యాయవాదులకు వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని, మహిళా న్యాయవాదుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పప్పు అనురాధ, కార్యదర్శి పి.హేమమాలిని వెల్లడించారు. సోమవారం పౌర గ్రంథాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 31న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మహిళా న్యాయవాదులకు నిర్వహించే వర్క్‌షాప్‌లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శిని, ఎపి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వివిఎస్.భానుమతి, జస్టిస్ చీమలపాటి రవి, విశాఖ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ రవినాథ్ డిల్హరి హాజరు కానున్నట్టు తెలిపారు.

ఈ వర్క్‌షాప్‌లో చిన్నారులపై అకృత్యాలు, మహిళలపై గృహహింస కేసులకు సంబంధించి యువ మహిళా న్యాయవాదులకు అవగాహనకు ప్రత్యేక సెషన్స్ నిర్వహిస్తారన్నారు. సమాజాభ్యున్నతిలో మహిళా న్యాయవాదులు పాత్రపై చైతన్యం కల్పిస్తారన్నారు. ఈ సందర్భంగా విశాఖ బార్ అసోసియేషన్ నుంచి ఎపి హైకోర్టుకు ఎలివేట్ అయిన ప్రముఖులకు సత్కారాలు, అసోసియేషన్ బ్రోచర్, లోగోల ఆవిష్కరణ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ వర్క్‌షాప్‌లో 300మంది దాకా యువ మహిళా న్యాయవాదులు పాల్గొంటారన్నారు. వైద్యశిబిరాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అసమానతలు, వివక్షలకు గురౌతున్న మహిళల అభ్యున్నతికి, వారి ఔన్నత్యాన్ని పెంపొందించేందుకు మహిళా న్యాయవాదుల ద్వారా ఆర్థిక, సాంఘిక, న్యాయపరమైన సహకారాలను అందించే లక్ష్యంతో మహిళా న్యాయవాదుల అసోసియేషన్ ఏర్పాటు చేసినట్టు ప్రకటించారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగశ్రీ, ఎన్. రాధారాణి, హేమలత, పద్మాబాయి, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పిడుగుపాటుకు బైకిస్ట్ దుర్మరణం

- మరొక వ్యక్తికి తీవ్రగాయాలు



మృతుడు పెంటయ్య

ప్రజాశక్తి-ఉక్కునగరం : గాజువాక స్టీల్ ప్లాంట్‌లో కాంటాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న పెంటయ్య అనే వ్యక్తి పిడుగుపాటుతో మృతి చెందిన సంఘటన స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం మధ్యాహ్నం వర్షం పడుతున్న సమయంలో ఐఎన్‌టియుసి కార్యాలయం సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పెంటయ్య, మరో వ్యక్తిపై పిడుగు పడింది. ఈ ఘటనలో పెంటయ్య అక్కడికక్కడే మృతి చెందగా, మరొక వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న స్టీల్ ప్లాంట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. కేసు వివరాలు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు గంగవరం గ్రామానికి చెందిన వ్యక్తి. సంఘటన స్థలానికి చేరుకున్న మృతుడి కుటుంబీకులు, బంధువులు కన్నీరు మున్నీరుగా రోదించడం పలువురి కంట తడిపెట్టించింది.

వరుస చోరీలు

ప్రజాశక్తి- పెందుర్తి :జివిఎంసి 96వ వార్డు దొగ్గువాని పాలెం సమీపంలోని జనచైతన్య లేఔట్‌లోని మూడు ఇళ్లల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. సమాచారం తెలుసుకున్న క్రైమ్ సీఐ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడి వివరాలను సేకరించారు. అనంతరం మీడియాతో జనచైతన్య లేఅవుట్‌లో నివాసముంటున్న ఒక బ్యాంకు మేనేజర్ నగరంలోనే తాటిచెట్లపాలెంలో తన బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడిఉన్నాయి. పరిశీలిచంగా పది తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. మరో ఇంట్లో జరిగిన చోరీలో రూ.పది వేలు నగదు, వెండి వస్తువులు దొంగిలించుకుపోయారు. మూడో ఇంట్లో జరిగిన దొంగతనంలో వెండి ఆభరణాలను దొంగలు తస్కరించుకుపోయారు. ఒకేరోజు మూడిళ్లల్లో చోరీలు జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇదే ప్రాంతంలో ఎటిఎం చోరీ ఘటన కూడా స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది.

ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇంటికి తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో పోలీసులకు సమాచారం ఇవ్వాలని, పోలీస్‌యాప్‌లో వివరాలు నమోదు చేయాలని ప్రజలకు పదేపదే అవగాహన కల్పిస్తున్నా ఏఒక్కరూ స్పందించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలకు ఆస్కారమేర్పడుతుందన్నారు. ప్రతి అపార్టుమెంట్‌లోనూ, వీలైతే ఇళ్లల్లోనూ సిసి కెమెరాలను ఏర్పాట చేసుకోవాలని సూచించారు. చోరీ ఘటనలపై దర్యాప్తును ముమ్మరం చేసి నిందితులను పట్టుకుని , చోరీ సొత్తును రికవరీ చేస్తామన్నారు.

సింథటిక్ ఇంధనంపై 'గీతం'లో సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న నీతి ఆయోగ్ సభ్యుడు సారస్వత్

ప్రజాశక్తి -మధురవాడ : దేశ విద్యుత్తు అవసరాలను తీర్చగలగడంతో పాటు కర్బన ఉద్గారాలను తగ్గించగల సామర్థ్యం అణువిద్యుత్తుకు మాత్రమే ఉందని ప్రముఖ శాస్త్రవేత్త, నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ వికె.సారస్వత్ అన్నారు. సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బిఎస్‌సిఇ సంయుక్త ఆధ్వర్యాన సింథటిక్ ఫ్యూయల్స్‌పై రెండు రోజుల అంతర్జాతీయ సమావేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో విద్యుత్తు డిమాండ్ మూడింతలకు పైగా పెరిగిందని,అయితే నేటికి బొగ్గు, ఇతర శిలాజ ఇంధన వనరుల ఆధారిత విద్యుదుత్పాదనపై అధికంగా ఆధారపడ్డామన్నారు. 2070 నాటికి కాలుష్య తీవ్రతను తగ్గించి, కర్బన ఉద్గారాలను లేకుండా చేయాలంటే ప్రత్యామ్నాయ మార్గాలు అవసరమన్నారు. దేశంలో ప్రస్తుతం అణువిద్యుత్తు వినియోగం 16 శాతంగా ఉందన్నారు.అణువిద్యుత్తు ఉత్పాదనలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించడం వల్ల కలిగే లాభనష్టాలను వివరించారు. గీతం ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన విద్యుత్తు ఉత్పాదనతో పాటు కాలుష్యం లేని తక్కువ వ్యయం గల ప్రత్యామ్నాయ ఇంధన ఉత్పత్తి మార్గాలను అన్వేషించాలని సూచించారు. కార్యక్రమంలో విటి ఇండియా న్యూక్లియర్ ఎనర్జీ పాట్నర్‌షిప్ డైరక్టర్ ప్రొఫెసర్ మైనేని గణపతి, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ మాజీ డైరక్టర్ ప్రొఫెసర్ విఎస్ఆర్‌కె. ప్రసాద్, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి, వివిధ దేశాల నుంచి శాస్త్రవేత్తలు, గీతం విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీ జరిగిన రోజునే సొత్తు రికవరీ

నిందితుడి అరెస్ట్ : వివరాలు వెల్లడించిన క్రైం ఎసిపి వెంకటరావు



వివరాలను వెల్లడిస్తున్న క్రైం ఎసిపి వెంకటరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : చోరీ జరిగిన రోజునే నిందితుడిని అరెస్ట్ చేసి, చోరీ సొత్తును రికవరీ చేసిన ఘటన భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దీనిపై నేరవిభాగం ఎసిపి ఎ.వెంకటరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.

జివిఎంసి ఒకటో వార్డు తగరపువలస పిట్టవారి వీధికి చెందిన పీతల వెంకట అనంత స్వర్ణలత ఈనెల 19న సోమవారం తన ఇంట్లో వెనుక భాగాన బహిర్భూమికి కూర్చుని ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనుక భాగాన వెళ్లి, ఆమె ముఖాన్ని గుడ్డతో మూసేసి, మెడలో ఉన్న రూ.50 వేలు విలువైన బంగారు ఆభరణాలను దొంగిలించుకు పోయారు. దీనిపై బాధితురాలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నేరస్థలాన్ని సందర్శించి, సమగ్ర దర్యాప్తు అనంతరం తగరపువలసకు చెందిన నిందితుడు అలబాన ఆదినారాయణను అరెస్ట్ చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఘటన జరిగిన రోజునే చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితుడిని చాకచక్యంగా అరెస్ట్ చేసిన స్థానిక పోలీసులను ఎసిపి అభినందించారు. విలేకర్ల సమావేశంలో క్రైం ఎస్ఐ శ్రీనివాసరావు, ఇతర పోలీసులు ఉన్నారు.

వేతన బకాయి చెల్లించాలి : సిఐటియు

హెచ్‌పిసిఎల్ రిఫైనరీ వద్ద జయలక్ష్మి ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికుల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నేత లక్ష్మణమూర్తి

ప్రజాశక్తి -ములగాడ : జయలక్ష్మి ఇంజినీరింగ్ కార్మికులకు నాలుగు నెలల వేతనాలతోపాటు పాతబకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హెచ్‌పిసిఎస్ విశాఖ రిఫైనరీ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా .సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ జయలక్ష్మి ఇంజినీరింగ్ కంపెనీ కాంట్రాక్టర్ వద్ద 36 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. వేతనాలతోపాటు ఇతర బకాయిలను చెల్లించాలని గతంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపడితే, సంబంధిత కాంట్రాక్టర్ వచ్చి, నెలరోజుల్లోనే కార్మికులకు రావాల్సిన అన్ని ఆర్థికబకాయిలు చెల్లిస్తామని లిఖితపూర్వకంగా హామీఇచ్చారన్నారు. అయితే నాలుగు నెలలు గడిచినా ఎటువంటి చెల్లింపులు చేపట్టకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బ్రిడ్జన్ రూఫ్ సబ్ కాంట్రాక్టర్ ముఖేష్ ఇంజినీరింగ్ కంపెనీలో మరో 10మంది కార్మికులకు పనిచేశారని, పని అయిపోయిందని అందరినీ తొలగించిన సంబంధిత కాంట్రాక్టర్, కార్మికులకు ఫైనల్ సెటిల్‌మెంట్ చేయలేదన్నారు. దీనిపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే, ఆరుగురికి చెల్లింపులు చేపట్టి, మిగతా నలుగురికి ఇవ్వకుండా పరారయ్యాడని ఆరోపించారు. దీనిపై హెచ్‌పిసిఎల్ యాజమాన్యానికి ఇప్పటివరకు నాలుగుసార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేకపోవడంతో ధర్నా ఆందోళనకు దిగాల్సి వచ్చిందని హెచ్చరించారు. హెచ్‌పిసియల్ యాజమాన్యమే ప్రిన్సిపల్ ఎంప్లాయిగా బాధ్యత కాంట్రాక్టు కార్మికుల వేతన బకాయిల వ్యవహారంలో జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే ఆందోళన మరింత తీవ్రం చేయక హెచ్చరించారు. ధర్నాలో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు అధ్యక్షుడు ఎం.కృష్ణారావు, సిఐటియు జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు పాల్గొన్నారు.

వైద్యుల రక్షణకు చట్టం తేవాలి

- రాష్ట్రపతికి జనవిజ్ఞాన వేదిక మెయిల్

ప్రజాశక్తి -గాజువాక : వైద్యులు, సిబ్బంది రక్షణ పటిష్టం చట్టం తీసుకొచ్చి, దాన్ని సమర్థవంతంగా అమలుకు చర్యలు చేపట్టాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ రమేష్ కుమార్, అధ్యక్షులు ఎస్‌వికె.పరశు రాం, ప్రధాన కార్యదర్శి కె.శేషగిరిరావు కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం రాష్ట్రపతికి మెయిల్ ద్వారా వినతి పత్రాన్ని పంపించారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు, తర్వాత కూడా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి ముఖ్యంగా మహిళల రక్షణకు కఠినచట్టాలను చేయాలని కోరారు. కోల్‌కత్తా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టం తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలతోపాటు భద్రతా చర్యలను మెరుగుపరచాలని కోరారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు


కలెక్టరుకు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 65వ వార్డు కెవెల్.రావు నగర్ దరి టిడ్కో ఇళ్ల సమీపంలో సర్వే నంబర్ 64, సబ్‌డివిజన్ 17,18 పరిధిలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని స్థానిక వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు కోరారు. సోమవారం జిల్లాకలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలు అంశాలను కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇష్టానుసారంగా షెడ్‌లను వేస్తున్నారని, దీనిపై గతంలో ఆర్‌డిఓ, తహశీల్దార్, ఇతర అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ప్రజావసరాల కోసం కేటాయించిన ప్రభుత్వస్థలంలో దురాక్రమణలు సరికాదని ఆక్రమణ దారులకు పలుమార్లు సూచించినా వారు మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆక్రమణకు గురౌతున్న ప్రభుత్వస్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుతోపాటు ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు విన్నవించామన్నారు. ఇక్కడి కెవెల్ రావు నగర్ రజక వీధి సమీపంలో గతంలో ధోబీఖానా, ఇతర అవసరాల కోసం ఉంచిన స్థలంలోనూ దళారుల ప్రమేయంతో కొందరు దురాక్రమణకు పాల్పడుతూ షెడ్లు నిర్మిస్తున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. ప్రభుత్వ భూములు దురాక్రమణపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చట్టపరమైన కఠినచర్యలతోపాటు ఆయా భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వార్డు టిడిపి అధ్యక్షుడు రట్టి వాసు ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న మజ్జి సోమేష్

ప్రజాశక్తి- ములగాడ: శ్రీకృష్ణ యాదవ సంఘం కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా తెలుగు యువత విశాఖ జిల్లా కమిటీ నేత ఉరుకోటి కాశీనాథ్ ఆధ్వర్యంలో వెంకన్నపాలెంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను 61వ వార్డు టిడిపి అధ్యక్షుడు మజ్జి సోమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆటల పోటీల్లో పాల్గొనడం ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తి, పోటీతత్వం అలవడుతుందన్నారు. గెలుపోటములు ఆశించకుండా ఆటగాళ్లంతా క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. కార్యక్రమంలో ఉరుకోటి దేవిడ్, మౌళి, ఉరుకోటి మురళి, జయశంకర్, బొట్ల చిన్న పాల్గొన్నారు.

కొత్త నేర చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జైళ్ల శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఆరిలోవ :కొత్తగా అమల్లోకి వచ్చిన నేర చట్టాలపై జైళ్ల శాఖ అధికారులు అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర జైళ్ల శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు సూచించారు. సోమవారం బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో విశాఖ కేంద్రకారాగారంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రెండో విడత జాతీయ సదస్సును ప్రారంభించారు. దేశంలోని 10 రాష్ట్రాల నుంచి సుమారు 28 జైళ్ళ శాఖ అధికారులు పాల్గొన్నారు. కొత్తగా వచ్చిన న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినీయం చట్టాలపై ఎన్‌విపి లా కాలేజీ అధ్యాపకులు వచ్చి జైళ్లశాఖ అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశాఖ కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్‌కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బదిలీ ఎంపిడిఒకు ఘన సత్కారం


అప్పలనాయుడును సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం ఎంపిడిఒగా విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న నీలం అప్పలనాయుడును సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిపి, ఎంపిటిసిలు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎన్నికల ముందు భోగాపురం మండలం నుంచి వచ్చిన నీలం అప్పలనాయుడు, ఎన్నికల సమయంలో సమర్థవంతంగా సేవలు అందించారు. మలి బదిలీల్లో భాగంగా ఆయనను తిరిగి భోగాపురంలోనే నియమించారు.

దీంతో బదిలీపై వెళుతున్న అప్పలనాయుడు పరిపాలనలో వివక్షత చూపించకుండాసేవలను అందించారని, అందరి మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో కొత్త ఎంపిడిఓ అడపా లవరాజు, ఇఓపిఆర్‌డి కెల్ల రామారావు, నాయకులు మజ్జి వెంకటరావు, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

వాణిజ్య హబ్‌గా గాజువాక అభివృద్ధి

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు


ఎమ్మెల్యే పల్లాను సత్కరిస్తున్న వర్తకసంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ప్రాంతాన్ని వ్యాపార, వాణిజ్య హబ్‌గా తీర్చిదిద్దుతానని, తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయనిటిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం గాజువాక వర్తక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ ఎంకె శ్రీనివాసరావులకు అభినందన సత్కార సభ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కొల్లా నరసింహ జగన్నాథగుప్తా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విశాఖ నగరంలో గాజువాక ప్రాంతం శరవేగంగా పురోగమిస్తోందని, ఇక్కడ చుట్టూ పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య రంగాలు ఉండటమే కారణమన్నారు. ఈ సందర్భంగా వర్తక సంఘం తరపున సమస్యలపై ఎమ్మెల్యే పల్లాకు వినతిపత్రం అందజేశారు.గాజువాకలో హోల్‌సేల్ వ్యాపారులకు మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలని, ఇతర జిల్లాల్లో మాదిరిగా ఒకేచోట వ్యాపార సంస్థలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాస్, నియోజకవర్గ ఇంచార్జ్ ప్రసాదుల శ్రీనివాస్, సంఘం ప్రతినిధులు పిపిఎస్ నాగేశ్వరరావు, ప్రముదుల విశ్వేశ్వరరావు, తెలుగుంట్ల నాగప్రకాష్ రావు, నంబూరి జగన్నాథరావు, పూడా రాజా పాల్గొన్నారు.

అనాథలకు ఆహార పొట్లాలు అందజేత


ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ప్రజాశక్తి - అరిలోవ : పాత డెయిరీ ఫారం వద్ద ఇందిరానగర్‌లో ఉన్న ఆనందమార్గ్ అనుబంధ సంస్థ అమృత్ విశాఖ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రహదారి పక్కన నివసిస్తున్న 150మంది పేదలకు ఆహారపొట్లాలను పంపిణీ చేశారు. ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, జగదాంబ ప్రాంతాల్లో రోడ్డు పక్కన సంచరించే పేద వికలాంగులకు, వృద్ధులకు ఆహారాన్ని అందించారు. కార్యక్రమంలో అమృత్ విశాఖ జిల్లా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు

కస్తూర్బా విద్యాలయంలో వృక్షాబంధన్

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఉన్న కస్తూర్బాగాంధీవిద్యాలయంలో సోమవారం వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన రాఖీలను వృక్షాలకు కట్టి, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకుంటామని వెల్లడించారు. ఏళ్లనాటి మహావృక్షాల పరిరక్షణలో భాగంగా చేపడుతున్న వృక్షాబంధన్ కార్యక్రమంలో తామూ భాగస్వాములమౌతామని, వారసత్వ సంపదగా వస్తున్న వృక్షాలను పరిరక్షించుకుంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి కె.గ్రేస్‌లిల్లీ, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది,విద్యార్థులకు పాల్గొన్నారు.

రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

నిర్మాణం మధ్యలో ఆగిపోయిన అనకాపల్లి లక్ష్మీదేవి పేట రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని తక్షణమే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ప్రతినిధి బృందం సోమవారం నిర్మాణం ఆగిపోయిన ఫ్లైఓవర్ బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ లక్ష్మీదేవిపేట రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యలోనే వదిలేయడాన్ని సిపిఎం తీవ్రంగా నిరసిస్తుందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే జిల్లాలోని చోడవరం, మాడుగుల నియోజవర్గాలతో పాటు పాడేరు జిల్లాకు చెందిన ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ రహదారి గుండానే రోజుకి వేలాదిమంది ప్రయాణం కొనసాగిస్తున్నారన్నారు. చిన్న వర్షం పడితే చాలు అనకాపల్లి అండర్ బ్రిడ్జి నీటిలో మునిగి పోవడంతో ఈ ప్రాంతాలకు పూర్తి రహదారి సౌకర్యం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు నిల్వ ఉండడంతో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వెళ్ళడానికి కూడా వీల్లేకుండా ఉందని, దీనితో ఇప్పటికే వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. చోడవరం, మాడగుల నియోజకవర్గాలు, అల్లూరి జిల్లా పాడేరు ప్రజలు రైల్వే స్టేషన్‌కు వచ్చేందుకు ఇదే మార్గమని తెలిపారు. ఇక్కడ రైల్వే గేట్ పడితే రైల్వేస్టేషన్‌కు, వివిధ కాలేజీలు, పాఠశాలలకు వచ్చే విద్యార్థులు, బెల్లం మార్కెట్‌కు వచ్చే వారు అధిక సమయం నిరీక్షించి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రాజు, మండల కమిటీ సభ్యులు కాళ్ళ తేలయ్య బాబు, బొప్పె ఉమామేశ్వరరావు, కె.ఈశ్వరరావు, బి.నూక అప్పారావు పాల్గొన్నారు.



నిర్మాణం నిలిచిపోయిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు



వాసుపల్లి ఠాగూర్‌కు అభినందిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

బాడీ బిల్డింగ్‌లో ఠాగూర్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి-అనకాపల్లి

హైదరాబాద్ సిటీ శంషాబాద్‌లో ఈ నెల 17న జరిగిన ఇండియా ఐసిఎన్ కంప్లీట్ నేచరల్ జూనియర్ కేటగిరి బాడీ బిల్డింగ్ కాంపిటీషన్‌లో అనకాపల్లి పట్టణం ఎఎంసి కాలనీకి చెందిన వాసుపల్లి ఠాగూర్ బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా రింగరోడ్డు జనసేన పార్టీ కార్యాలయంలో బీసీ సాధికార రాష్ట్ర కన్వీనర్ మళ్ళ సురేంద్ర సమక్షంలో వాసుపల్లి ఠాగూర్‌ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ కాంపిటీషన్‌లో ముందు ముందు ఎన్నో విజయాలు సాధించి అనకాపల్లికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి బాబీ, ఎస్.భానుచందర్ (అఖి), షేక్ రియాజ్, కోచ్ ఉప్పులి శివసాయి, రంజిత్, వాసుపల్లి తేజ, గోపి, రసూల్, ప్రసాద్, విజయ్, పుష్పరాజ్, ఏఎంసి కాలనీ యువకులు పాల్గొన్నారు.



డాక్టర్ బండారు సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

ఘనంగా డాక్టరు బండారు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి చోడవరం

చోడవరం పట్టణంలోని ప్రముఖ వైద్యులు బండారు సత్యనారాయణ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆసుపత్రి ఆవరణంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో పలువురు ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైస్ ఎంపీపీ బైన కుమారి ఈశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, వేచలపు ప్రకాష్, అడప శ్రీనివాసరావు, ముత్యాల నాయుడు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌తో ప్రజా సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అనేక ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామని కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన వారి వద్ద నుండి కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి, స్వీకరించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొణతాలను కలిసిన ఎస్ఎంసి సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని ఊడేరు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు సోమవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఎస్ఎంసి ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థి సిరసపల్లి కుమారి పద్మ విజయం సాధించారు. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి బాబీ, ఇంటి తాతారావు, దండుపాటి గంగరాజు, సిరసపల్లి అచ్చిబాబు, తర్ర గోవింద, సిరసపల్లి సత్యారావు, కొత్తపల్లి వంశీకృష్ణ పాల్గొన్నారు

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక చినరామస్వామి కోవెల వద్ద శ్రీచినరామ యోగ సిద్ధ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు ఇందులో పాల్గొని ఆంజనేయస్వామి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చినరామ యువజన సంఘం వంశం పరంపర ధర్మకర్త విల్లూరి మహాలక్ష్మి నాయుడు నాగ జగదీష్‌ను శాలువాతో సత్కరించి ఆంజనేయస్వామి మెమొంటోని బహూకరించారు. ఈ కార్యక్రమంలో బొడ్డేడ మురళి, కర్రి సేమియా రాము, ఆళ్ల గణేష్, కాండ్రేగుల జనార్ధన్, పెంటకోట చంద్రరావు, బుద్ధ లక్ష్మీ అప్పారావు, సూరిశెట్టి రాముడు, పొలిమేర అరవింద్, పిళ్ళా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రికి 3 ఎన్‌క్యుఎస్ సర్టిఫికెట్లు



కలెక్టర్‌తో జిల్లా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి -అనకాపల్లి

జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖకు జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలకు(ఎన్‌క్యూఎఎస్) సంబంధించిన సర్టిఫికెట్లును అనకాపల్లి ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రి మూడు సాధించింది. ఈ సందర్భంగా సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చేతులు మీదుగా అధికారులకు, డాక్టర్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జిల్లా ఆసుపత్రికి -3, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు-16, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు-2, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలకు-7 సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అందజేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య అధికారులను, ఎంఎల్‌హెచ్‌పిలను, డాక్టర్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలాజీ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ ఆధికారి శ్రీనివాసరావు, డిపిఎంఓ, ఎన్‌హెచ్‌ఎం, డిఐఓ, ఇతర వైద్య శాఖ అధికార్లు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రి సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని 24 మండలాల పేద ప్రజలకు వైద్యం అందించే అనకాపల్లి ఎన్టీఆర్ 200 పడకల జిల్లా ఆసుపత్రిలో కనీస వైద్యం అందడం లేదని సిపిఐ నాయకులు సోమవారం డిఆర్ఓ దయానిధికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్.భద్రం, మాజీ కౌన్సిలర్ తాకాసి వెంకటేశ్వరరావు, కోరుబిల్లి శంకర్రావు, ముక్కామల చిన్ని తదితరులు మాట్లాడుతూ ఆసుపత్రిలో కాటన్, బ్యాండేజ్, గ్లౌజులు, సూదులు, సర్జికల్ సామాగ్రి పేద రోగులు చేత కొనిపిస్తున్నారని తెలిపారు. యాక్సిడెంట్ కేసులకు ఎమర్జెన్సీ వార్డులో ఎంబిబిఎస్ డాక్టర్లు చేస్తే వైద్యం చేయిస్తున్నారని, ఆర్థోపెటిక్, జనరల్ సర్జన్, న్యూరో సర్జన్, మత్తు డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదని పేర్కొన్నారు. రూ.2 కోట్లుతో ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ మిషన్ ఆపరేట్ చేసే టెక్నీషియన్ లేక మూలన పడిందన్నారు. పేద రోగులకు ఉచిత వైద్యం అందించాల్సిన ఈ జిల్లా ఆసుపత్రి దళారీలకు వ్యాపార కేంద్రంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ మాఫియా, ప్రైవేట్ అంబులెన్స్‌ల మాఫియా ఇక్కడ వచ్చే కేసులను కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించి లక్షల రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోపోవడంతో దానిలో వారి పాత్ర పట్ల పలు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. సిజేరియన్లకు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు, పోస్టుమార్టం కోసం వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. ఈ ఆసుపత్రిలో జరుగుతున్న అవకతవకలపై వెంటనే విజిలెన్స్ ఎంక్వైరీ జరిపిస్తే నిజా నిజాలు బయటపడతాయని వారు తెలిపారు.

తాత్కాలిక కాజ్‌వే పై నుండి వర్షపు నీరు ప్రవాహం

తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

ఆదివారం కురిసిన భారీ వర్షానికి మండలంలోని విజయరామరాజుపేట వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక కాజ్‌వేపై నుండి వర్షపు నీరు ప్రవహించింది. అధిక మొత్తంలో సోమవారం కూడా వర్షపు నీరు ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయరామరాజుపేట వద్ద ఉన్న వంతెన గతంలో కూలిపోవడంతో ప్రత్యామ్నాయంగా రాకపోకలకు తాత్కాలికంగా కాజ్‌వేను అధికారులు ఏర్పాటు చేశారు. పైభాగంలో ఏమాత్రం వర్షం కురిసిన వర్షపు నీరు అధికంగా రావడంతో కాజు వేపై నుండి నీరు పారుతుంది. ఈ రోడ్డు గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. పాడేరు -విశాఖ, ఇటు నర్సీపట్నం- చోడవరం, మాడుగుల చోడవరం మధ్య అధిక వాహనాలు ప్రయాణించడంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగానే ఉంటుంది. బస్సులు, లారీలు, ఆటోలు, వందలాది ద్విచక్ర వాహనాలు ప్రతిరోజు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. కొద్దిపాటి వర్షానికే కాజువేపై నుండి నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రాత్రి సమయంలో ఉధృతంగా నీరు వస్తే ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. బుచ్చయ్యపేట పోలీసులు సోమవారం దగ్గరుండి వాహనాలు రాకపోకలను నియంత్రణ చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెన నిర్మాణం త్వరగా చేపట్టాలని, అంత వరకు కాజ్‌వే పై నుండి వర్షపు నీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



విజయరామరాజు పేట వద్ద కాజ్‌వే పై నుండి పారుతున్న నీరు

ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను సోమవారం విశాఖపట్నంలో జిల్లా జడ్పీటీసీల ఫోరమ్ అధ్యక్షులు స్థానిక జెడ్‌పీటీసీ దొండ రాంబాబు, పలువురు సర్పంచ్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెపి అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, ఐతంపూడి సర్పంచ్ పెద్దాడ నాయుడు, పొట్టిదొరపాలెం ఉప సర్పంచ్ గుద్దేటి శ్రీనివాస్, నీలకంఠపురం వై.రవి పాల్గొన్నారు.



బొత్సకు శుభాకాంక్షలు తెలుపుతున్న రాంబాబు తదితరులు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

అమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- అచ్యుతాపురం

అనకాపల్లి జిల్లా, అచ్యుతాపురం మండలం, దోసూరు పంచాయతీ, గండివానిపాలెం గ్రామంలో అమ్మ చారిటబుల్ ట్రస్టు, గండివానిపాలెం యూత్ ఆధ్వర్యంలో ఆధ్వర్యాన ఈ నెల 18న ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు 70 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, ఐ డ్రాప్స్ పంపిణీ చేశారు. 27 మంది రోగులను కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి బస్‌లో తరలించారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, పేదలకు వైద్య సేవలు అందిస్తున్న అమ్మ చారిటబుల్ ట్రస్ట్ బృందాన్ని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నర్మాల సుజాత రామకృష్ణ, అమ్మ చారిటబుల్ ట్రస్టు వైస్ చైర్మన్ ఎస్.అర్జున, ట్రస్టు, స్థానిక యూత్ సభ్యులు ఆదిరెడ్డి సన్నిబాబు, ఎస్.తాతబాబు, ఎస్.మోహన్, జి.నాయుడు, జి.శ్రీను, ఎస్.శ్రీను, వి.రాజేష్, పి.శ్రీను, జె.దివాకర్, శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు రత్నంరాజు, క్యాంప్ మేనేజర్ అరుణ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మానవతా దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక సిద్ధార్ధ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం అంతర్జాతీయ మానవతా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రపంచ శాంతి, ధర్మం, అహింసా మార్గాలకు మొట్ట మొదటి మార్గదర్శి, మానవతావాది అయిన బుద్ధుని చిత్ర పటానికి యర్రావారి వీధిలో సంస్థ కార్యాలయంలో ముందుగా సంస్థ అధ్యక్షులు బల్లా నాగ భూషణం ఆధ్వర్యాన పూలమాల వేసి నివాళులర్పించారు. బుద్ధభూమి మాసపత్రికను సంస్థ సభ్యులతో కలిసి బల్లా నాగభూషణం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పుజ్జి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కొత్తూర్తి రామారావు, రేబాక వరలక్ష్మి, పట్నాల మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో సౌకర్యాల మెరుగునకు చర్యలు

ప్రజాశక్తి-కె.కోటపాడు

భవిత కేంద్రంలో సౌకర్యాలు మెరుగునకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఎస్ అమ్మి నాయుడు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల సృజనా శక్తిని పరిశీలించారు. బడి బయట ఉన్న విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భవితా కేంద్రాలు మరింత ఆధునికరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బుద్ధి మాంద్యం గల పిల్లల్లో మేధో శక్తిని గుర్తించి వారికి అనుగుణంగా బోధన సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 డివిడి ప్రసాద్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ బి శకుంతల పాల్గొన్నారు.



భవిత కేంద్రాన్ని సందర్శించిన అమ్మినాయుడు తదితరులు

మొబైల్ రికవరీ మేళా

284 ఫోన్లు బాధితులకు అందజేత

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి జిల్లా పోలీసులు 7వ విడత మొబైల్ రికవరీ మేళా సోమవారం నిర్వహించారు. రూ.32 లక్షల విలువగల 284 మొబైల్ ఫోన్లను బాధితులకు జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు డీఎస్పీలు చేతుల మీదుగా జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌బి డీఎస్పీ బి.అప్పారావు, దిశా డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారి నుండి మొత్తం 3,300 ఫిర్యాదులు నమోదు కాగా, 7 విడతల్లో సుమారు రూ.2 కోట్ల 77 లక్షల విలువైన 1,930 మొబైల్ ఫోన్లను ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ మిస్సింగ్ పోర్టల్ సిఈఐఆర్ https://www.ceir.gov.inలో పోయిన మొబైల్ ఫోన్ వివరాలు అందించవచ్చని తెలిపారు. ఆపై వెంటనే ఐటీ కోర్ బృందం ట్రేస్ చేస్తూ బాధితులకు మొబైల్స్ అందజేసేందుకు కృషి చేస్తుందన్నారు. మొబైల్ ఫోన్ పోతే జిల్లా పోలీసు వాట్సాప్ నెంబర్ 95052 00100 కు హాయ్ అని టైప్ చేయడం ద్వారా akpmobiletracker.in లింక్ నొక్కడం ద్వారా పోయిన మొబైల్స్ ఫిర్యాదుల స్వీకరణకు ఎఫ్ఐఆర్ కట్టకుండా, పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండా సులభతరం చేసిందని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా పోలీసులు అతి తక్కువ సమయంలోనే 7వ విడతలో భాగంగా వివిధ ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, కడప జిల్లాల నుండి రికవరీ చేసిన 284 మొబైల్ ఫోన్లను అందించినట్లు చెప్పారు. మొబైల్స్ ట్రేస్ చేసిన ఐటి కోర్ సిబ్బందిని, అనకాపల్లి పట్టణ పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, లక్ష్మణరావు, అప్పలనాయుడు, ఐటి కోర్ ఎస్సై రఘువర్మ, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



బాధితురాలికి ఫోన్ అందిస్తున్న డిఎస్‌పిలు

టిటిడిలో ఆర్‌టిఐ అమలుపై సమీక్ష

ప్రజాశక్తి- అనకాపల్లి

తిరుమల, తిరుపతి దేవస్థానం (టీటీడీ)కు సమాచారం కోసం 12 ఏళ్ల క్రితం చేసిన దరఖాస్తుపై సోమవారం ఆర్టీఐ కమిషనర్ చావలి సునీల్ వర్చువల్ విధానంలో విచారణ చేపట్టారు. అప్పీలు (నెం.4396/టీఎస్ఐసీ/2013 టీసీ 380/ఎస్ఐసీ-సీహెచ్ఎస్/2021)పై చేపట్టిన విచారణకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.... ఆర్టీఐ చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ ఆర్టీఐ చట్టం-2005 సెక్షన్ 4 (1) (బి) కాపీ, సిటిజన్ ఛార్టర్‌ను అనుసరించి టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కార్యాలయానికి 2004 ఏప్రిల్ 1 నుంచి జమలు, ఖర్చులు, ట్రస్టు బోర్డు, ప్రొటోకాల్ నియమావళి, వివిధ కేటగిరీ భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మరో 6 అంశాలపై సమాచారం కోరుతూ 2012 నవంబర్ 11న దరఖాస్తు చేశారు. అయితే అధికారులు ఆర్టీఐ సెక్షన్ 6 (1), 19 (1) దరఖాస్తులకు స్పందించ లేదు. దీంతో రాష్ట్ర సమాచార కమిషన్‌ను కాండ్రేగుల వెంకటరమణ ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సోమవారం అప్పీలుపై విచారణ చేపట్టారు. టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఇతరత్రా పరిపాలన విభాగాధిపతులు, ట్రస్టు బోర్డు నియామకాలు, బదిలీలను ప్రభుత్వం చేస్తుందని, రాష్ట్ర శాసనసభ రూపొందించిన దేవాదాయ, ధర్మాదాయ చట్టం ద్వారా ఏర్పాటైన ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్, టీటీడీ నియమావళి ఆర్టీఐ చట్టం సెక్షన్లు 2 (హెచ్), 2 (హెచ్) (డి) (2), 2 (ఎఫ్), సుప్రీం కోర్టు తీర్పు (సివిల్ అప్పీలు నెంబర్ 10044/2010 తేది: 13-11-2019)లను అనుసరించి టీటీడీ పూర్తిగా పబ్లిక్ అథారిటీ నిర్వచనం కిందకు వస్తుందని, కాబట్టి కోరిన సమాచారాన్ని ఇప్పించాలని దరఖాస్తుదారు కాండ్రేగుల వెంకటరమణ వాదనలు వినిపించారు. అనంతరం సమాచార కమిషనర్ చావలి సునీల్ మాట్లాడుతూ టీటీడీలో ఆర్టీఐ అమలుపై సమీక్షించి తీర్పు ప్రకటిస్తామని, ఆర్టీఐ పరిధిలో ఉన్న సమాచారాన్ని దరఖాస్తుదారునికి తక్షణం అందజేయాలని, అంతవరకు అప్పీలును ముగించేది లేదని చెప్పారు. జాప్యాన్ని గుర్తించి అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. విచారణలో టీటీడీ అధికారులు, అప్పీలుదారు కాండ్రేగుల వెంకటరమణ పాల్గొన్నారు.

నేటి నుండి గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

ప్రజాశక్తి- అనకాపల్లి

జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 18 వరకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి ప్రసాద్ రావు తెలిపారు. పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం, ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గడం గాలికుంటు వ్యాధి ముఖ్య లక్షణాలని పేర్కొన్నారు. పాడి రైతులు నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలన్నారు. జ్వరం బలహీనత, చూడి ఆఖరి దశలో గర్భస్రావం, మాయ వేయకపోవడం, చూడి నిలబడకపోవడం, మగ పశువుల్లో వృషణాల వాపు, కీళ్లవాపు, వంధ్యత్వం సోకిన పశువుల వల్ల మనుషులకు కూడా సోకుతుందన్నారు. నాలుగు నెలల నుంచి 8 నెలల ఆడ దెయ్యలకు తప్పనిసరిగా ఈ టీకాలు వేయించాలన్నారు. ఈ అవకాశాన్ని పాడి పశు రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాడవాడలా రక్షాబంధన్ వేడుకలు



తమ్ముడికి రాఖీ కడుతున్న చిన్నారి అక్క

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

అన్నా చెల్లెళ్ళు, అక్కా తమ్ముళ్ళ ప్రేమానురాగాలకు ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాతే రాఖీలు కట్టాలని పండితులు చెప్పడంతో సాయంత్రమే రక్షాబంధన్ వేడుకలు నిర్వహించుకున్నారు. రాఖీ పండుగ సందర్భంగా సాయంత్రం వరకు రాఖీ స్టాల్స్, స్వీటు, పండ్ల దుకాణాలు రద్దీగా కనిపించాయి. పట్టణ ప్రాంతాల్లో స్థిరపడిన ఆడపడుచులు స్వగ్రామాలకు చేరుకుని సోదరులకు రాఖీలు కట్టారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

దేవరాపల్లి : మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నదమ్ములకు అక్క చెల్లెళ్ళు రాఖీలు కట్టి మిఠాయిలను తినిపించారు. మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి విద్యార్థినుల అన్నదమ్ములు రాగా వారికి వారు రాఖీలు కట్టారు. అలాగే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలుగుపూడి గురుకుల బాలుర విద్యాలయానికి అక్క చెల్లెలు వచ్చి తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి భువన మాధురి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.జయ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక అయ్యన్న జూనియర్, డిగ్రీ కాలేజీల్లో సోమవారం రక్షా బంధన్‌ను వేడుకగా నిర్వహించారు. అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టరు ఖాశీం ఆధ్వర్యంలో "నేను నీకు రక్ష-నీవు నాకు రక్షా-ఇరువురం దేశానికి రక్షా" అంటూ సామూహిక ప్రతిజ్ఞతో విద్యార్థులు, విద్యార్థినులు పరస్పరం రాఖీలు కట్టారు. కళాశాలల ఆవరణలో గల వృక్షాలకు కూడా వారు రాఖీలు కట్టి వృక్షో రక్షతి రక్షిత:అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బండారు వెంకటరమణమూర్తి, సీమసిరి రమణ, గాడి అప్పారావు, కెవిఎస్.ప్రసాద్, కల్యాణి, శివ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం జెడ్పీహెచ్ (తురకబడి) పాఠశాలలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చిన్నారులకు ఎస్ఎఫ్ఐ నాయకులకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ గీతాకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐగా మహిళలకు ఏ ఆపద వచ్చినా తాము ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ గౌతమ్, ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు రాజు, స్వామి, వరహాలు, జయకృష్ణ, రాము, మహేంద్ర, దుర్గా తదితరులు పాల్గొన్నారు

నక్కపల్లి:మండలంలోని సోమవారం ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.సోదరి ,సోదరుడు ల ప్రేమానుబంధాలకు ప్రతీక గా రాఖీ పౌర్ణమి వేడుకలను ప్రతి ఇంటా ఘనంగా జరుపుకున్నారు.సోదరుడు కు సోదరి రాఖీ కట్టి ,స్వీట్లు తినిపించి ప్రేమానుబంధాలను ,ఆత్మీయతను చాటుకున్నారు .స్థానికంగా అందుబాటులో లేని సోదరి ,సోదరుడు వాట్సాప్ ద్వారా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ప్రేమానుబంధాలను పంచుకున్నారు.



రాఖీ కడుతున్న దృశ్యం

భీమునిపట్నం : విశాఖ పర్యటనలో భాగంగా ఉన్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జెకె.మహేశ్వరికి స్థానిక బీచ్ రోడ్డులో నోవాటెల్ వద్ద తూర్పు గోదావరి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జి.సునీత రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మీయంగా ఒకరికొకరు రక్షా బంధన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు

ఎయు విసికి రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

ఎంవిపి కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావుకు ఎయులోని తన చాంబర్‌లో బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.



జస్టిస్ మహేశ్వరికి రాఖీ కడుతున్న సునీత

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

-ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు చిట్టి నాయుడు



రికార్డులను పరిశీలిస్తున్న చిట్టినాయుడు

ప్రజాశక్తి-మాడుగుల:జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమం కింద ఈనెల 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 18వ తేదీ వరకు పశువులకు గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధుల టీకాలను వేస్తామని ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు వి.చిట్టి నాయుడు పేర్కొన్నారు. నాలుగు నెలల వయసు దాటిన పశువులను సమీపంలోని పశు వైద్యశాలలో టీకాలు వేయించాలన్నారు. సోమవారం మండలంలోని వీరవల్లి అగ్రహారం రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని పాడిరైతులకు సిబ్బంది అందిస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. మండలానికి గోకులం షెడ్లు 25 మాత్రమే మంజూరు అయ్యాయని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన వారికి అందిస్తామన్నారు. పాడి రైతుల నుండి ముందుగా ధరఖాస్తులు స్వీకరించాలని సూచించారు.

చీడికాడ:ఈనెల 20వ తేదీ నుండి వచ్చేనెల 18వ తేదీ వరకు పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేయడం జరుగుతుందని పశువైద్యాధికారి గాయత్రి దేవి తెలిపారు. మండలం కేంద్రంలో ఆమె మాట్లాడుతూ, ఆవులు, గేదెలు, పెయ్యలకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేయడం జరుగుతుందని, ఈ సేవలను రైతులందరూ ఉపయోగించుకోవాలని కోరారు. మంగళవారం తురువోలు గ్రామంలో పశువులకు గర్భ కోశ చికిత్సా శిబిరం జరుగుతుందని పెదగోగడ పశు వైద్యాధికారిని ఏవీఎస్ రాఘవమ్మ తెలిపారు.



మడులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్

వరిలో ఎరువుల యాజమాన్యం పాటించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:వరి సాగులో సమతుల్యమైన ఎరువుల యాజమాన్యం పాటించాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. మండలంలోనిఉపమాక, చిన దొడ్డిగల్లు, కాగిత, గుల్లిపాడు, దోసలపాడు ,ముకుంద రాజుపేట, డొంకాడ, దేవవరం గ్రామాల్లో సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గ్రామ వ్యవసాయ సహాయకులతో కలిసి వరి మడులను పరిశీలించారు. రైతులకు పలు, సూచనలు సలహాలు ఇచ్చారు. ఉపమాక, కాగిత, గొడిచెర్ల, దేవవరం ప్రాంతాల్లో కాస్త బెట్ట పరిస్థితులు వున్నాయని, రైతులు అవకాశం వున్నంత వరకు జీవ తడి ఇవ్వాలని, ఒక వారం నారుమడులు కాపాడు కోవడం కోసం 2శాతం యూరియా లేక 19-19-19ను 4 గ్రాముల చొప్పున లీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు.ఎకరా వరి పొలానికి ఒక బస్తా డిఏపి, 20 కిలోల పొటాష్ ఎరువులను దమ్ములో లేదా వరి నాటిన 10 రోజుల లోపు వేయాలన్నారు. ప్రధాన పొలంలో వరి పంట నాటిన తర్వాత 20 నుంచి 30 రోజులకు (పిలకలు పెట్టే దశలో) 25 నుంచి 30 కిలోల యూరియా ఎరువును , 50 నుంచి 60 రోజులకు (అంకురం ఏర్పాడు దశ లేదా పొట్ట దశలో) యూరియా 25-30 కిలోలు, పోటాష్ ఎరువు 20 కిలోలు ఒక ఎకరం పొలంకు వేయాలని రైతులకు తెలిపారు. మండలంలోని సుమారుగా 4400 ఎకరాల సాధారణ విస్తీర్ణం గాను 1850 ఎకరాల్లో ఇప్పుడు వరకు వరి నాట్లు పడ్డాయి అన్నారు. ఈ పర్యటనలో గ్రామ వ్యవసాయ సహాయకులు రాజు, నాయుడు, మోహన్, శిరీష, రజిత రైతులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులకు ఐరన్ నిచ్చెనల ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురం ఎస్సీ కాలనీలో పది వాటర్ ట్యాంకులకు మెట్లు శిథిలావస్థకు చేరాయి. దీంతో ట్యాంకులను శుభ్రం చేసే అవకాశం లేకుండా పోయింది. దీనిపై స్పందించిన సర్పంచ్ లోచల సుజాత, పంచాయతీ కార్యదర్శి వై.శ్రీనివాసరావు ఈ ట్యాంకు లను పరిశీలించి ఐరన్ నిచ్చెలను ఏర్పాటు చేయిం చారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీ కె.రాజేష్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నిచ్చెనలు వేయిస్తున్న సర్పంచ్



హాజరైన అధికారులు

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్


ప్రజాశక్తి-నక్కపల్లి:డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఈఓపిఆర్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పి.ఆర్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈనెల 23న గ్రామ సభలు నిర్వహణ, తీర్మానాలు, ఉపాధి హామీ కూలీలకు 100 రోజులు పని తదితర వాటిపై డిప్యూటీ సిఎం అధికారులకు సూచనలు చేశారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి- చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయభారతి అన్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తాను కళాశాలలో ప్రధానాచార్యురాలిగా బాధ్యతలు చేపట్టే సమయానికి పలు సమస్యలు ఉండేవని, వాటిని పరిష్కరించి కళాశాలకు మంచి రూపు తీసుకు వస్తున్నామన్నారు. విద్యార్థుల్లో అంతర్గతంగా ఉన్న ప్రతిభను వెలుగులోకి తెచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. విద్యలోనే గాక, ప్రతిభ ఉన్న రంగాలలో ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రాంత విద్యార్థులు ఉన్నతంగా ఎదుగుతారన్నారు. ఇందులో భాగంగా క్రీడలు, సాంస్కృతిక, ఇతర రంగాలలో విద్యార్థులను అభివృద్ధి చేయాలన్నదే తన ముఖ్య ఉద్దేశమన్నారు. కళాశాల స్థల రక్షణకు తాత్కాలిక కంచె నిర్మించడంతోపాటు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల వాహనాలను నిలిపి ఉంచేందుకు షెడ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

స్పందనలో సిపిఎం వినతి



వినతిపత్రం చూపుతున్న అప్పలరాజు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం, ప్యాకేజీ పూర్తిస్థాయిలో చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు కోరారు. అనకాపల్లిలో కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నిర్వాసితుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం ఎంత ప్యాకేజీ చెల్లిస్తుందో తెలియక నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. నిర్వాసితులను అధికారులు పట్టించుకోకోక పోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కలెక్టర్ నిర్వాసితులతో సమావేశం నిర్వహించి, వారి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. భూసేకరణలో సర్వం కోల్పోయిన రైతాంగాన్ని, మత్స్యకారులకు, దళితులకు, నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇల్లులు కోల్పోయిన వారిలో 18 సంవత్సరాల నిండిన వారికి 25 లక్షలు, నిర్వాసితులకు 15 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని, ప్రతి సెంటు భూమి కి ప్రతీ చెట్టు కు పరిహారం,ప్రతీ నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వాలని కోరారు.

సిఐలు బాధ్యతల స్వీకరణ



కొత్తకోట సిఐ కోటేశ్వరరావు



నక్కపల్లి సిఐ కుమారస్వామి

ప్రజాశక్తి-కొత్తకోట:కొత్తకోట సర్కిల్ సీఐగా జి.కోటేశ్వరరావు సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకూ సిఐగా బాధ్యతలు నిర్వహించిన ఎల్.అప్పలనాయుడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో విఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టిన నూతన సిఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ, సర్కిల్ పరిధిలో ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహణతో పాటు శాంతి భద్రతల పరి రక్షణకు కృషి చేస్తానని తెలిపారు. సర్కిల్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, నాటు సారా తయారీ పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తానని వివరించారు. రోడ్డు భద్రత పై అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చొరవ తీసుకుంటామని సిఐ చెప్పారు. అంతక ముందు కొత్తకోట, రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్య పేట ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. ఆయనకు స్థానిక సిబ్బంది అభినందనలు తెలిపారు..

నక్కపల్లి:నక్కపల్లి సిఐగా కుమారస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ సిఐగా పని చేసిన విజయ్ కుమార్ శ్రీకాకుళం జిల్లా టెక్కలి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కుమారస్వామికి విజయ్ కుమార్ బాధ్యతలు అప్పగించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. పలువురు నాయకులు సీఐను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలను అందజేశారు. సిఐగా బాధ్యతలు చేపట్టిన కుమారస్వామి గతంలో ఎస్ రాయవరం మండలంలో ఎస్ఐగా పనిచేశారు. ఆయనకు స్థానిక సిబ్బంది, తదితరులు అభినందనలు తెలిపారు.

జిడిపి పెంచడానికి ప్రణాళిక

ప్రజాశక్తి-పాడేరు : ప్రపంచ దేశాల జిడిపిలో ఐదవ స్థానంలో ఉన్న మన దేశాన్ని 2047 నాటికి మూడవ స్థానం చేరుకునే దిశగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చర్యలు తీసుకుంటున్నారని, అందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి విక్షిత్ ఆంధ్ర-2047 పేరుతో అభివృద్ధికి కృషి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. సోమవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ జిల్లా అధికారులకు సిపిఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ రంగాలలో 2029 నాటికి 15శాతం అభివృద్ధి సాధించే దిశగా జిల్లా కార్యాచరణ ప్రణాళికలను ఈ నెలాఖరులోగా సమర్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రాధమిక సెక్టార్లయిన వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య శాఖలలో ప్రస్తుతమున్న సూచీ ఆదారంగా15శాతం వృద్ధికి కార్యాచరణ చేపట్టాలని, పారిశ్రామిక, ఆర్థిక, విద్య, వైద్య, సేవా, పర్యాటక రంగాలలో 15 శాతం వృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సిపిఓ ఎస్ఎస్ఆర్ పట్నాయక్, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య శాఖల అధికారులు నంద్, రమేష్ కుమార్‌రావు పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న డిఇ, జెడ్‌పిటిసి, తదితరులు

తాండవ నీరు విడుదల

ప్రజాశక్తి-నాతవరం:మండలంలోని తాండవ జలాశయం నీటిని తాండవ రిజర్వాయర్ డిఈ అనురాధ, నర్సీపట్నం జడ్పిటిసి సుంకల రమణమ్మ, మాజీ జడ్పిటిసి కరక సత్యనారాయణ, మండల పార్టీ ప్రెసిడెంట్ నందిపల్లి వెంకటరమణలు సోమవారం విడుదల చేశారు. ఈ జలాశయం పరిధిలో తుని, నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాలకు సంబంధించి సుమారుగా 52 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కుడి కాలువ ద్వారా 250 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సంవత్సరం నీరు పూర్తిస్థాయి పంటకు సరిపడుతుందని, నీటికీ ఎటువంటి ఇబ్బంది ఉండదని డిఈ అనురాధ తెలిపారు. నీటిని విడుదల చేయడంతో రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ తాండవ చైర్మన్ పారుపల్లి కొండబాబు, జెఈ శ్యామ్, వర్క్ ఇన్స్పెక్టర్ నాగబాబు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాకలపాడు గ్రామంలోని పెద్ద చెరువు వద్ద గంగాదేవి ఆలయ మూడవవ వార్షికోత్సవం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు కె.రామకృష్ణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందని, ఈ వార్షికోత్సవంను జయప్రదం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఎసిపి నరసింహమూర్తి, వేదికపై రాజు

డ్రగ్స్‌తో యువత జీవితాలు నాశనం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ప్రముఖ మానసిక వైద్యులు ఎన్.ఎన్ రాజు తెలిపారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో సోమవారం "పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగ విష సంస్కృతి-ప్రమాదంలో యువత భవిష్యత్తు" అను అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్తు పదార్థాలు తీసుకోవడంతో కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువకులలో అవగాహన పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థులను జాగృతం చేయాలన్నారు. మత్తు పదార్థాలతో కలుగుతున్న ప్రమాదాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఏనాడో నిషా విముక్తి దేశం అంటూ ప్రకటించిందని, అందుకు తగిన కృషి మాత్రం జరగ లేదన్నారు.

వక్త ఎసిపి అన్నెపు నరసింహమూర్తి మాట్లాడుతూ, డ్రగ్స్ వినియోగం కరోనా కంటే ప్రమాదకరన్నారు. ఇంటర్నెట్ చదువుల కారణంగా పిల్లలు రాత్రివేళలో నిద్రపోవడం లేదన్నారు. తల్లిదండ్రులు దీనిని గ్రహించడం లేదన్నారు.స్మార్ట్ ఫోన్లు, లాప్ టాప్‌లతో విద్యార్థులు గడుపుతూ ఉంటే, చదువుకుంటున్నారని తల్లిదండ్రులు భావిస్తున్నారని తెలిపారు. వీటి ద్వారా చదువు, విజ్ఞానం కంటే అశ్లీల చిత్రాలు చూడటం వంటి వాటికి పాల్పడుతున్నారన్నారు. విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఉన్న సగం మంది ఖైదీలలో గంజాయి వంటి మత్తు పదార్థాలతో పట్టుబడిన నేరస్తులే అని తెలిపారు. విశాఖ నగరంలో ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో గంజాయి పట్టుబడుతుందన్నారు.ఈ సదస్సులో ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు వి.ఎస్ పద్మనాభ రాజు, ప్రభుత్వ కృష్ణ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే పరిశ్రమల ఏర్పాటు

-సిఎం చంద్రబాబు గొప్పలు చెప్పుకోవడం సరికాదు

-మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలలలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీ సిటీలో సోమవారం పలు పరిశ్రమలను ప్రారంభించి అదంతా ఆయన ఖ్యాతిగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ హెద్దేవా చేశారు. సోమవారం ఆయన లాసన్స్ బే కాలనీలోని బొత్స కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే 16 పరిశ్రమలను ప్రారంభించామని చంద్రబాబు ఏ విధంగా చెప్పుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. శ్రీ సిటీలో సోమవారం జరిగిన కార్యక్రమాలను చూస్తే బ్రాండ్ ఇమేజ్ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పడుతున్న తపన అర్థమవుతుందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో శ్రీసిటీలో పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు భూములను కేటాయించడమే కాకుండా, మౌలిక సదుపాయాలు కల్పించామని గుర్తు చేశారు. విదేశీ పెట్టుబడులను రాబట్టేందుకు ఆయా పారిశ్రామికవేత్తలకు అప్పటి ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించిందని అమర్నాథ్ వెల్లడించారు. చంద్రబాబు శ్రీసిటీలో ప్రారంభించిన ఏ ఒక్క పరిశ్రమ కూడా ఆయన హయాంలో వచ్చింది కాదని అమర్నాథ్ స్పష్టం చేశారు. పెట్టుబడులు తాము తెస్తే దానికి చంద్రబాబు నాయుడు తన బ్రాండ్ వేసుకుంటున్నారని, పరిశ్రమలను మేము ఏర్పాటు చేస్తే దానికి తన స్టిక్కర్ అంటించు కుంటున్నాడని అమర్నాథ్ వ్యాఖ్యానించారు. భోగాపురం ఎయిర్పోర్ట్, మూలపేట పోర్టు, బందరు పోర్టు, రామాయపట్నం పోర్టు అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చొరవతోనే ఏర్పాటు అయ్యాయని అమర్నాథ్ వివరించారు.

హత్యాచారంపై కొనసాగిన నిరసనలు



ఆనందపురంలో నిరసన చేపడుతున్న వైద్య సిబ్బంది

కొల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాలో వైద్యులు, వైద్య సిబ్బంది నిరసనలు సోమవారం కొనసాగించారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

విశాఖ కలెక్టరేట్ : కొల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ విశాఖలో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ చేపట్టిన ఆందోళన సోమవారానికి ఏడో రోజుకు చేరింది. ఈ క్రమంలో ఆంధ్ర వైద్య కళాశాల నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు వందలాది మంది వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. వారినుద్దేశించి జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ టి.పృథ్వీరాజ్ మాట్లాడుతూ వైద్యుల రక్షణ కోసం కమిటీ వేసినట్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, దీనిపై తమకు ఎటువంటి నమ్మకమూ లేదని అన్నారు. కమిటీలతో మహిళా వైద్యులకు రక్షణ ఉండదన్నారు. సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.ప్రియా కృష్ణవేణి, డాక్టర్ ఊహ రాపేటి, డాక్టర్ ఎన్.జగదీశ్వరరావు, డాక్టర్ కె.సంయుక్త, డాక్టర్ సి.శ్రీ నాగకిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలని కెజిహెచ్ ఆర్ఎంఒ డాక్టర్ డి.భాస్కరరావు కోరారు. సోమవారం నిర్వహించిన



దేవరాపల్లిలో...

కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ ఎస్‌కెఇ.అప్పారావు, ఎఎం.కోసా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విశాఖపట్నం బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ పిజె.శ్రీనివాస్, డాక్టర్ ఎంవివి.మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ పాల్గొన్నారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

జూనియర్ డాక్టర్లు చేపట్టిన ఆందోళనకు విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మద్దతు తెలిపారు.

నల్ల రిబ్బన్లను రాఖీలుగా కట్టి..

ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థినులు అదే కళాశాలలో చదువుతున్న జూనియర్ వైద్యులకు నల్ల రిబ్బన్లను రాఖీలుగా కట్టి వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. పలు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు జూనియర్ డాక్టర్లు చేపట్టిన నిరసన కార్యక్రమానికి హాజరై మద్దతు తెలిపారు. మద్దతు తెలిపిన వారిలో సిఐటియు గోపాలపట్నం జోన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకటరావు, పిఒడబ్ల్యు జిల్లా సహాయ కార్యదర్శి కె.నిర్మల, 32వ వార్డు జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు, తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు, ఎఐడిఎస్ఒ కార్యదర్శి కె.అభిలాష్ ఉన్నారు.

ఆనందపురం : కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆనందపురం మండల పాస్టర్స్ ఫెలోషిప్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నీళ్లకుండీలు కూడలిలో ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మండల పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ ఆర్ ప్రభుదాస్ మాట్లాడుతూ మహిళలకు భద్రతకు మరింత కఠినచర్యలు, చట్టాలు చేయాలని కోరారు. నిందితులను కఠినంగా శిక్షించడం ద్వారా కొల్‌కత్తా వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా భరోసా, న్యాయం చేయాలని కోరారు.నిరసనలో సంఘం వైస్ ప్రెసిడెంట్ శాంతి రాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పీటర్ జాన్ మోజెస్, యు డానియల్, తిమోతి, రాబర్ట్, స్థానిక నాయకులు పాల్గొన్నారు

గాజువాక చైతన్య విద్యార్థుల నిరసన ర్యాలీ

గాజువాక : కొల్‌కత్తాలో జూనియర్ మహిళా డాక్టర్‌పై హత్యాచార ఘటనకు నిరసనగా గాజువాక చైతన్య డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థులు నిరసన చేపట్టారు. ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు, వాలంటీర్లు ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని, రోడ్డుపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కోల్‌కతా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. నిరసనలో చైతన్య కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరాపల్లి:కోల్‌కతాలోని ఆర్‌జి కార్ ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యంత పాచవిక హత్యాచారంపై



రోలుగుంటలో...

మండల కేంద్రం దేవరాపల్లిలో యువత సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ప్రతినిధులు కెవి.రమణ కొరుప్రోలు శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు పాల్పడిన కామాంధులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సంఘటన యావత్తు దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిందన్నారు. అటువంటి నరరూప రాక్షసులను వెంటనే ఉరితీయాలని, మహిళలకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో జి.రమాదేవి, జాగరపు లక్ష్మి, గంగవంశపు సంతోష్, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

రోలుగుంట:కోల్‌కత్తాలోని వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరశిస్తూ రోలుగుంట జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కళాశాల, స్థానిక పీహెచ్‌సి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని నినాదాలు చేసుకుంటూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పలువురు ఉపాధ్యాయులు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు పీవీఎం. నాగజ్యోతి, హిందీ ఉపాధ్యాయులు రెహనాబేగం, కాశీరత్నం, కళాశాల అధ్యాపకులు, పీహెచ్ సి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



గాజువాకలో...

వేతనాలు చెల్లించాలని.. టిబి ఆసుపత్రి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:టిబి ఆసుపత్రి కార్మికులకు బకాయి రెండు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని, జివో ప్రకారం రూ.16 వేలు జీతాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం టీబీ ఆసుపత్రి ఎదుట హాస్పిటల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ హాస్పిటల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పి.వెంకట్రావు మాట్లాడుతూ, కాంట్రాక్టర్ ఇచ్చిన హామీ ప్రకారం రెండు నెలల జీతం నేటికి వేయలేదని తక్షణం బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మరో పక్క అన్ని హాస్పిటల్స్‌లోనూ ఒక రోజుకి మూడు షిఫ్టులుగా 24 గంటలు అమలు చేస్తుండగా, టిబి హాస్పిటల్ శానిటేషన్ కార్మికులకు 27 గంటలు అమలు చేయడం దుర్మార్గమన్నారు. అదనమైన 3 గంటల పనికి ఓటి ఇచ్చి 24 గంటలు షిఫ్ట్ టైమింగ్స్ ఉండే విధంగా మార్చాలని డిమాండ్ చేశారు. మద్దిలపాలెం సిఐటియు కోశాధికారి, టిబి హాస్పిటల్ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మిక యూనియన్ గౌరవ అధ్యక్షులు వి.కృష్ణారావు మాట్లాడారు. జివో 549 ప్రకారం రూ.16 వేల జీతం అమలు చేయాలని కోరారు. పిఎఫ్, ఈఎస్ఐ కట్టడంలో అవకతవకలు ఉన్నాయని, దానిని సరిదిద్దాలని కోరారు. శానిటేషన్ కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలన్నారు. శానిటేషన్ కార్మికుల హక్కులను కాలరాస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సమస్యలు



నినాదాలు చేస్తున్న కార్మికులు

పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. శానిటేషన్ కార్మికుల సమస్యలపై కాంట్రాక్టర్, టిబి హాస్పిటల్ సూపరిండెంట్, జిల్లా కలెక్టర్‌లకు అనేక వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టిబి హాస్పిటల్ అధికారులు కార్మికుల పక్షాన కాకుండా కాంట్రాక్టర్ నిలుస్తున్నారని విమర్శించారు.డిఎంఈకి ఫిర్యాదు చేసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిబి హాస్పిటల్ వర్కర్స్ పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా వైజాగ్ ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం బీచ్ రోడ్ లోని విశాఖ మ్యూజియంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఫోటో ప్రదర్శనను జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ, ప్రతి ఏడాది ఈ ప్రదర్శనలు వైజాగ్ ఫోటో జర్నలిస్టులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తమ జీవీఎంసీ తరపున ఫోటో జర్నలిస్టులకు పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ఉచితంగా విశాఖ మ్యూజియమును ప్రదర్శనకు ఇచ్చామన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శనలో అరుదైన ఫోటోలు ఉన్నాయని, విశాఖ వాసులు తిలకించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వైజాగ్ ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు పిఎన్ మూర్తి మాట్లాడుతూ, రెండు రోజుల ప్రదర్శనలో 300 పైగా ఛాయ చిత్రాలను ఉంచామన్నారు. మంగళవారం కూడా ప్రదర్శన ఉంటుందని, సందర్శికులు తిలకించాలని కోరారు. కార్యక్రమంలో ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ కార్యదర్శి జి.తిరుపతిరావు, ఫోటో జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.